
సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 11 । మార్చి । 2025



అర్హులందరికీ ఇళ్లు..

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
36.1 /18.3

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'పిల్లలను ప్రేమతో చూడాలి'



సదాశివనగర్ : పిల్లలను ప్రేమతో చూడాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా జడ్జి నాగరాణి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మహిళా చట్టాలు, హక్కులపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు, పిల్లలపై వేధింపులు, పోక్సో తదితర అంశాలను జిల్లా జడ్జి వివరించారు. పిల్లలను బాధ్యతాయుతంగా పెంచాలన్నారు. తల్లిదండ్రుల కష్టం పిల్లలకు తెలియాలన్నారు. అప్పుడే పిల్లలు బాధ్యతాయుతంగా ఉండి చదువులపై శ్రద్ధ పెట్టి ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. ప్రధానంగా ఆడపిల్ల అని అశ్రద్ధ చేయకుండా బాగా చదివించాలన్నారు. న్యాయపరమైన, చట్టపరమైన సమస్యలు ఏవైనా ఎదురైతే టోల్‌ఫ్రీ నంబర్ (15100)కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ స్వర్ణలత, డీసీపీవో స్రవంతి, తహసీల్దార్ గంగాసాగర్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, సీహెచ్‌వో నాగరాజు, పంచాయతీ కార్యదర్శి మాధవీలత, సాధన టీం సభ్యులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన డీపీవో మురళి



కామారెడ్డి క్రైం: జిల్లా పంచాయతీ అధికారిగా కె.మురళి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్‌రావు నిజామాబాద్ డీపీవోగా బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో మురళి నల్గొండ నుంచి బదిలీపై వచ్చారు. నూతన డీపీవోను ఆ శాఖకు చెందిన పలువురు అధికారులు, సిబ్బంది కలిసి సన్మానించారు.

కరపత్రాల ఆవిష్కరణ

కామారెడ్డి క్రైం : జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో రూపొందించిన ఆయిల్‌పాం కరపత్రాలను సోమవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలో ఆయిల్‌పాం సాగును ప్రోత్సహిస్తోందన్నారు. మొక్కలు, డ్రిప్, యాజమాన్యం తదితర అంశాల కోసం రైతులకు ఎకరానికి రూ.50,918 వరకు రాయితీ ఇస్తోందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

నిజామాబాద్ సీపీ బాధ్యతల స్వీకరణ



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా పోతరాజు సాయి చైతన్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, లా అండ్ ఆర్డర్ పరిరక్షణలో రాజీపడేదే లేదని పేర్కొన్నారు. నార్కోటిక్ విభాగంలో పని చేసిన తనకు డ్రగ్స్ కట్టడిపై అవగాహన ఉందన్నారు. గతంలో ఐదుసార్లు నిజామాబాద్‌కు వచ్చానన్నారు. సైబర్ నేరాల నివారణకు పోలీసుశాఖ తరఫున అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

నాగిరెడ్డిపేట: ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈవో షేక్‌సలాం సూచించారు. గోపాల్‌పేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ విష్ణుకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం జరిగిన ఇంటర్ సెకండియర్ ఇంగ్లిష్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 8,072 మంది విద్యార్థులకుగాను 7,921 మంది హాజరయ్యారన్నారు. ఇందులో జనరల్ విభాగానికి సంబంధించి 6,683 మంది విద్యార్థులు, వొకేషనల్‌కు సంబంధించి 1,238 మంది విద్యార్థులున్నారని పేర్కొన్నా రు. ఆయన వెంట డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ మల్లేశం ఉన్నారు.

ప్రజావాణి వింటున్నారు!

చొరవ చూపుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- ఎప్పటికప్పుడు జూమ్ ద్వారా మండల అధికారులకు దిశానిర్దేశం
- సమస్యల పరిష్కారానికి చర్యలు
- 85 శాతం పరిష్కారం



దివ్యాంగుడి వద్దకు వచ్చి సమస్యను ఆలకిస్తున్న కలెక్టర్ సంగ్వాన్



కలెక్టరేట్‌లో బారులు తీరిన ఫిర్యాదుదారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రతి సోమవారం మండల కేంద్రాలతోపాటు కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండల స్థాయిలో సమస్యలు పరిష్కారం కానివారు జిల్లాస్థాయి ప్రజావాణికి వచ్చి వినతులు అందిస్తున్నారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ చొరవ చూపుతుండడంతో ఆయా ఫిర్యాదులు వేగంగా పరిష్కారానికి నోచుకుంటున్నాయి. 85 శాతానికిపైగా ఫిర్యాదులు పరిష్కారానికి నోచుకుంటున్నాయి.

ఆశిష్ సంగ్వాన్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు 32 పర్యాయాలు ప్రజావాణి నిర్వహించారు. ఇప్పటివరకు 3,437 వినతలు వచ్చాయి. ఇందులో 2,935 ఫిర్యాదులను పరిష్కరించారు. ఇంకా 502 పెండింగ్‌లో ఉన్నాయి. కలెక్టర్ ప్రజావాణికి ప్రాధాన్యత ఇస్తూ దాదాపు ప్రతివారం కార్యక్రమానికి హాజరవుతూ ప్రజల సమస్యలను ఆలకిస్తున్నారు. ఆయా సమస్యలపై అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ఫిర్యాదును పరిశీలించి, వెంటనే జూమ్ ద్వారా సంబంధిత మండల అధికారులతో మాట్లాడుతున్నారు. ఆ సమస్యను చెప్పి వెంటనే పరిష్కరించాలని ఆదేశిస్తున్నారు. ఎప్పటిలోగా పరిష్కరిస్తారో చెప్పాలంటూ గడువు తీసుకుంటున్నారు. దీంతో అధికారులు ఆ సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లా స్థాయి అధికారి ద్వారా పరిష్కారం అయ్యే సమస్య అయితే అక్కడే ఉన్న సంబంధిత శాఖ అధికారిని పిలిచి దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలని ఆదేశిస్తున్నారు. ప్రతి సోమవారం ప్రజావాణిలో అన్ని శాఖల అధికారులు పాల్గొంటున్నారు. దీంతో చాలా సమస్యలు పరిష్కారమవుతున్నాయి. ఒకవేళ జిల్లా స్థాయిలో పరిష్కరించలేని సమస్యలు ఉంటే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నారు. ప్రతివారం పెండింగ్‌లో ఉన్న సమస్యలపైనా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతున్నారు. ప్రజావాణి ముగియగానే సాయంత్రం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. వినతులను పరిష్కరించడం గానీ, పరిష్కార మార్గాలు చూపడం గానీ చేయాలని సూచిస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న వాటి విషయంలో చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్నారు. అలాగే ఫిర్యాదులపై తీసుకున్న చర్యలకు సంబంధించిన సమాచారాన్ని ఫిర్యాదుదారులకు అందజేయాలని సూచిస్తున్నారు.

101 ఫిర్యాదులు నమోదు

కామారెడ్డి క్రైం : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 101 ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కార్యక్రమంలో పాల్గొని ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జెడ్పీ సీఈవో చందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగుల సేవా సమితి ప్రతినిధులు

దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాల ని విజ్ఞాన్ దివ్యాంగుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు దుర్గాప్ర సాద్ డిమాండ్ చేశారు. ఈ విషయమై సంఘం ప్రతినిధులు సోమవారం కలెక్టర్‌ను ప్రజావాణిలో కలిసి వినతిపత్రం అందించారు. అమలవుతున్న పథకాల్లో దివ్యాంగులకు 5 శాతం వాటా ఇవ్వాలని, పింఛన్ రూ.6 వేలకు పెంచాలని, ఉచిత ర వాణా సౌకర్యం కల్పించాలని కోరారు.

కల్యాణలక్ష్మి ఇప్పించరూ..

ఎల్లారెడ్డి మండలం గండిమాసానిపేట్ గ్రామానికి చెందిన అన్వ విఠల్ 2023 జూన్ 5 న తన కూతురు బాలమణి వివాహం జరిపించాడు. కల్యాణలక్ష్మి కోసం దరఖాస్తు చేశాడు. అన్ని అర్హతలున్నా తన దరఖాస్తును ఎల్లారెడ్డి రెవెన్యూ అధికారులు ఉద్దేశపూర్వకంగా తిరస్కరించారని ఆరోపిస్తున్నాడు. సోమవారం ప్రజావాణిలో ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. కల్యాణలక్ష్మి మంజూరు చేయాలని కోరాడు.



సమస్యను వివరిస్తున్న ఫిర్యాదుదారు

పింఛన్ మార్పిడి కోసం..

రాజంపేట మండలం అన్నారం గ్రామానికి చెందిన ముత్యాల కిష్టయ్య నాలుగు నెలల క్రితం మరణించాడు. ఆయన పేరిట వృద్ధాప్య పింఛన్ వచ్చేది. దానిని తన తల్లి పేరుపైకి మార్పిడి చేయాలని కోరుతూ కిష్టయ్య కుమారుడు కిషన్ అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. పంచాయతీ అధికారులకు దరఖాస్తు చేసుకున్నా లాభం లేకపోవడంతో సోమవారం ప్రజావాణికి వచ్చి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించాడు.



వివరాలు తెలుపుతున్న ముత్యాల కిషన్

అధికారులు సమన్వయంతో పని చేయాలి

- పంటలను కాపాడేందుకు కృషి చేయాలి
- వీసీలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు
- సాగునీటి సరఫరాపై అధికారులతో సమీక్ష

కామారెడ్డి టౌన్ : పంటలను కాపాడేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం వారు హైదరాబాద్ నుంచి ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ శాంతికుమారితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నట్లు ప్రచారం చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేక వాతావరణాన్ని సృష్టించే ప్రయత్నం జరుగుతోందన్నారు. కలెక్టర్లు ఈ విషయమై ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్లు, వ్యవసాయ అధికారుల నుంచి నివేదికలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులతో కూడా సమన్వయం చేసుకుంటూ పంట నష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. రాజకీయ దురుద్దేశాలతో ప్రస్తుతం ఉన్న పరిస్థితిని ఎక్కువ చేసి చూపించినా, రబీ యాక్షన్ ప్లాన్‌లో లేని ప్రాంతాలలో పంటలు ఎండిపోతున్నట్లు వార్తలు వచ్చినా వెంటనే స్పందించాలన్నారు. ప్రజలకు వాస్తవాలను తెలపాలన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, అధికారులు

కలెక్టర్లే బాధ్యత తీసుకోవాలి

కట్టుదిట్టంగా నీటిని విడుదల చేసి, పంటలను కాపాడే బాధ్యతను కలెక్టర్లు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. పోలీసుల సహకారం తీసుకొని చివరి ఆయకట్టుకు నీళ్లు చేరేలా చూడాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ సరఫరా సమస్యలు లేవని సీఎస్ శాంతికుమారి పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలపై వచ్చే తప్పుడు వార్తలకు స్పందించడంతో పాటు, జిల్లాలో రైతులకు సాగునీరు అందించేందుకు తీసుకుంటున్న చర్యలు, సాగు అవుతున్న పంట వివరాలు, నీటి సరఫరా చేసి కాపాడిన పంట వివరాలు పత్రికల్లో ప్రచురించేలా చూడాలని కలెక్టర్లకు సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులతో సమావేశమయ్యారు. గతేడాది వేసవిలో పంటల స్థితిగతులపై వివరాలు సమర్పించాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, డీఏవో తిరుమల ప్రసాద్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చేలా పనిచేస్తాం

- ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి
- ప్రతి ఫిర్యాదుపైనా స్పందిస్తాం
- ఎస్పీ రాజేశ్ చంద్ర



మాట్లాడుతున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పోలీసు శాఖ పనితీరును మెరుగుపరిచి ప్రజలు మెచ్చేలా పనిచేస్తామని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రాజేశ్ చంద్ర పేర్కొన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తాను బాధ్యతలు తీసుకున్న వెంటనే పట్టణంలో పర్యటించానని, చాలా వాహనాలు నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్నట్లు గుర్తించానని పేర్కొన్నారు. మనుషులకు పేర్లు ఉన్నట్టే, వాహనాలకు తప్పనిసరిగా నంబర్లు ఉండాల్సిందేనన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించేలా పోలీసింగ్ ఉంటుందన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు, పరిసరాలను పరిశీలించానని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో మంచి వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు పకడ్బందీ చర్యలు ఉంటాయన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఏయే రోడ్లపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయో గుర్తించి వాటిని నివారించేందుకు చర్యలు చేపడతామన్నారు. ప్రజలు చేసే ప్రతి ఫిర్యాదును పరిశీలిస్తామని, వారి సమస్యను పరిశీలించి తీసుకున్న చర్యల గురించి సమాధానం కూడా ఇస్తామని పేర్కొన్నారు. నిఘాను పటిష్టం చేసి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా గట్టి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లను సందర్శించి, సేవలు మెరుగుపడేలా సిబ్బందిని సన్నద్ధ చేస్తానన్నారు. దొంగతనాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లా కేంద్రాన్ని చుట్టేసిన ఎస్పీ..

బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎస్పీ రాజేశ్ చంద్ర జిల్లా కేంద్రాన్ని చుట్టేశారు. పట్టణంలోని ప్రధాన రోడ్లతో పాటు పలు ప్రాంతాలను సందర్శించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ పరిసరాలు, కమాండ్ కంట్రోల్ రూం, రికార్డుల నిర్వహణ, కేసుల్లో ఇన్వెస్టిగేషన్ తీరు, పెండింగ్ కేసులు, సమస్యల పరిష్కారం కోసం స్టేషన్‌కు వచ్చే ప్రజలతో అధికారులు, సిబ్బంది వ్యవహార సరళి తదితర అంశాలను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.



పట్టణ పోలీస్ స్టేషన్‌లో వివరాలు తెలుసుకుంటున ఎస్పీ రాజేశ్ చంద్ర

ఎస్పీ వెంట ఏఎస్పీ చైతన్యరెడ్డి, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

బాధ్యతల స్వీకరణ

కామారెడ్డి క్రైం : జిల్లా ఎస్పీగా నియమితులైన రాజేశ్ చంద్ర సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్పీగా పని చేసిన సింధు శర్మ హైదరాబాద్ ఇంటలిజెన్స్ విభాగానికి బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో రాజేశ్ చంద్ర వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రత, రక్షణకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయనను జిల్లాకు చెందిన పలువురు పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బల్దియాను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

- అప్పుల ఊబి నుంచి బయటపడేద్దాం
- రెండు నెలల్లో మార్పు రాకుంటే చర్యలు తప్పవు
- కామారెడ్డి బల్దియా అభివృద్ధి సమావేశంలో ఎమ్మెల్యే కేవీఆర్
- వేరువేరుగా అన్ని విభాగాలతో 7 గంటల పాటు చర్చ



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి బల్దియాను రాష్ట్రంలోనే ఆదర్శంగా మార్చడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, కార్మికులకు సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో వేరువేరుగా సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సమీక్షలు కొనసాగాయి. అధికారులు పనితీరు మెరుగుపరచుకోవాలని, 2 నెలలో మార్పు రాకుంటే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని హెచ్చరించారు.

కాంట్రాక్టర్లతో..

అధికారులపై బెదిరింపులు మానుకోవాలని కాంట్రాక్టర్‌లకు సూచించారు. సీనియారిటీ ప్రకారం బిల్లులు చెల్లిస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎంబీ రికార్డులు చేయడంపై డీఈ వేణుగోపాల్, ఏఈ శంకర్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకే కాంట్రాక్టర్‌కు పెద్ద మొత్తంలో బిల్లులు చెల్లించడంపై అధికారులను నిలదీశారు. నిబంధనల ప్రకారం పనులు చేసినవారికి త్వరలో బిల్లులు చెల్లిస్తామని కాంట్రాక్టర్‌లకు భరోసానిచ్చారు.

అవినీతికి తావివ్వొద్దు..

వార్డు ఆఫీసర్లు, రెవెన్యూ విభాగం, ఔట్‌సోర్సింగ్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో రెండు గంటలకుపైగా పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బల్దియాలో పలువురు అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయన్నారు. బర్త్ సర్టిఫికెట్‌కు రూ. 8 వేల వరకు వసూలు చేసినట్లు సాక్ష్యాలున్నాయన్నారు. అక్రమంగా 700 వరకు సర్టిఫికెట్లు జారీ చేసిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అభిలాష్‌పై క్రిమినల్ కేసు పెట్టాలని కమిషనర్ రాజేందర్‌రెడ్డిని ఆదేశించారు. అక్రమంగా విధుల్లో చేర్చుకున్న 16మందిని తొలగించాలన్నారు. డబ్బులు తీసుకుని ఇష్టారాజ్యంగా భవనాల కొలతలు వేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయని ఆర్‌వో రవిగోపాల్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతికి తావులేకుండా పనిచేయాలని అధికారులకు సూచించారు.

బల్దియా రూ. 70 కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అప్పుల ఊబినుంచి బయటపడేయడానికి అందరూ కృషి చేయాలన్నారు. అక్రమ కుళాయిలను గుర్తించి, పన్నులు వసూలు చేయాలన్నారు. ఆస్తి పన్నుల లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా వార్డు ఆఫీసర్లు చూసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులకు బానిసలుగా కాకుండా నిర్భయంగా పని చేయాలని సూచించారు. బల్దియా బోర్లు వాడుకుంటున్న ప్రైవేట్ వ్యక్తులపై కేసులు నమోదు చేయాలన్నారు.



సమావేశంలో పాల్గొన్న వార్డు ఆఫీసర్లు

కార్మికులు, నాయకులతో సమావేశం..

మున్సిపల్ సానిటేషన్, వాటర్‌వర్క్స్, ఎలక్ట్రిసిటీ విభాగాల కార్మికులతో పాటు, కార్మిక సంఘాల నాయకులతో సుమారు రెండు గంటల పాటు సమావేశం నిర్వహించారు. సానిటేషన్ జవాన్‌లతో పాటు వారి కింద పని చేస్తున్న కార్మికుల జాబితాను తీసుకుని పేరు పేరున మాట్లాడి ఫోన్ నంబర్లు తీసుకున్నారు. ప్రజాప్రతినిధులు, నేతల ఇళ్లలో పని చేయవద్దన్నారు. 45 మంది ప్రతినెలా జీతాలు తీసుకుంటూ పని చేయకుండా ఖాళీగా తిరుగుతున్నారని, వారు పద్ధతి మార్చుకోవాలని సూచించారు. కార్మికులపై పెత్తనం చేయడం, ఉద్యోగాలు ఇప్పిస్తామని వసూళ్లకు పాల్పడడం మానుకోవాలని పలువురు కార్మిక సంఘాల నాయకులను హెచ్చరించారు. రాజకీయ నాయకులకు ఇన్‌ఫార్మర్లుగా ఉన్న ఉద్యోగులు పద్ధతి మార్చుకోవాలన్నారు. స్థాయికి మించి ఉన్న వారికి నోటీసులు ఇచ్చి తొలగించాలని కమిషనర్‌కు సూచించారు. రెగ్యులర్‌గా వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

టౌన్‌ప్లానింగ్ విభాగంపై..

టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులతో గంటకు పైగా చర్చించారు. ఈ విభాగంపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. హోర్డింగ్‌లు, సెంట్రల్ డివైడర్‌లలో లాలిపాప్‌లు, ప్రకటన బోర్డులపై పన్నులు విధించి ఆదాయం సమకూర్చాలని టీపీవో గిరిధర్‌కు సూచించారు. నిబంధనల మేరకు భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ స్థలాలను సంరక్షించాలన్నారు.

క్లుప్తంగా

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): విద్యార్థుల అభ్యసనాభివృద్ధి వార్షిక ఫలిత నివేదిక కోసం వదల్‌పర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థుల సామర్థ్యాలను బాహ్య పరిశీలకుడిగా వచ్చిన భానుప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదవడం, రాయడంతోపాటు గణిత చతుర్విధ ప్రక్రియలను ఆయన పరిశీలించారు. మూడురోజులపాటు పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను భానుప్రసాద్ పరిశీలిస్తారని పాఠశాల హెచ్‌ఎం రాజశేఖర్ తెలిపారు. సీఆర్పీ రాజయ్య, ఉపాధ్యాయులు సంతోష్, అనిత, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

అల్లాపూర్ మాల సంఘం కమిటీ ఎన్నిక



పిట్లం(జుక్కల్): అల్లాపూర్‌లో సోమవారం బాన్సువాడ డివిజన్ మాల సంఘం తెలంగాణ ప్రధాన కార్యదర్శి పోతురాజు రాజు ఆధ్వర్యంలో మాల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గైని పోచయ్య, ఉపాధ్యక్షుడిగా గైని రాములు, జనరల్ సెక్రెటరీగా పోతురాజు రాజు, జాయింట్ సెక్రెటరీగా గైని సాయిరాం, కోశాధికారిగా గైని శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా గైని నాగయ్య, క్యాషియర్‌గా గైని హన్మాండ్లు, యువజన విభాగం అధ్యక్షుడిగా గైని సతీష్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా గైని శ్రీకాంత్, సలహాదారులుగా గైని లింగం, గైని అంబయ్య, గైని రాములు, గైని సాయిలు, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కళాశాలల ఏర్పాటుకు స్థలాలు కేటాయించండి



నిజాంసాగర్ (జుక్కల్): ఉన్నత విద్యా సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలను కేటాయించాలని సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను పిట్లం ఏఎంసీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్ కోరారు. నిజాంసాగర్‌లో అగ్రికల్చర్ యూనివర్సిటీకి 150 ఎకరాలు, నార్సెల్ లా కళాశాలకు 50 ఎకరాలు, ఫిషరీస్ రీసెర్చ్ సెంటర్‌కు 50 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. సకాలంలో స్థలాలు కేటాయిస్తే సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు కళాశాలలు ఏర్పాటు చేయిస్తానని చెప్పారని ఆయన తెలిపారు.

మోసగించిన యువకుడి రిమాండ్

దోమకొండ: ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన కేసులో దోమకొండకు చెందిన యువకుడిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవంతి తెలిపారు. సదరు యువతిని ప్రేమిస్తున్నానంటూ పెళ్లి చేసుకొని లైంగికదాడికి పాల్పడి వదిలివేసినట్లు పేర్కొన్నారు. యువతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసి యువకుడిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

- ఈ నెల 31 వరకే గడువు
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి

కామారెడ్డి క్రైం: అనధికార లేఅవుట్లు, వ్యక్తిగత ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో మున్సిపల్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, లేఅవుట్లు వేసిన యజమానులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2020 ఆగస్టు 31 నాటికి ముందే అనధికార లేఅవుట్లలో 10 శాతం అమ్మకం జరిగి ఉన్నట్లయితే, మిగతా 90 శాతం ప్లాట్లను ప్రస్తుతం క్రమబద్ధీకరించుకోవచ్చని తెలిపారు. ఇందుకోసం 25 శాతం రిబేటు అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. మార్చి 31, 2025 వరకు మాత్రమే ఇది వర్తిస్తుందన్నారు. అంతేకాకుండా వ్యక్తిగత ప్లాట్లకు కూడా రాయితీ వర్తిస్తుందన్నారు. అభ్యంతరం లేని ప్లాట్లకు ఈ సౌకర్యం ఉందన్నారు. ప్రభుత్వ భూములు, వక్ఫ్ బోర్డు, ఎండోమెంట్ భూములు, నీటి పారుదల శాఖ భూములు, సీలింగ్ భూములు, శిఖం భూములు, కోర్టు కేసులు ఉన్న ప్లాట్లకు ఈ అవకాశం వర్తించదని వివరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ రమేష్ రెడ్డి, జెడ్పీ సీఈవో చందర్, ఆయా శాఖల అధికారులు, డాక్యుమెంట్ రైటర్లు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి



మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని రంగాల్లోనూ పురుషులతో మహిళలు పోటీ పడాలన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన మహిళా ఉద్యోగులను శాలువాలతో సత్కరించారు. అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు

- ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

బాన్సువాడ రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని బాన్సువాడ ఎమ్మెల్యే, వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి నాగారం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తు చేసుకున్న 79 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం 4 విడతలుగా రూ.5 లక్షలు బ్యాంకు అకౌంట్‌లో జమ చేస్తుందన్నారు. బేస్ మెంట్ లెవెల్‌కు రూ.లక్ష, లెంటల్ లెవెల్‌కు రూ.లక్ష, స్లాబ్ నిర్మాణం పూర్తయిన తర్వాత రూ.2లక్షలు, మిగితా పనులన్నీ పూర్తయిన తర్వాత రూ.లక్ష చొప్పున ఎలాంటి ట్యాక్సులు లేకుండా చెల్లిస్తుందన్నారు. నాయకులు అంజిరెడ్డి, మోహన్ నాయక్, నార్లసురేష్, ఎంపీడీవో బషీరుద్దీన్, తహసీల్దార్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పోచారం గ్రామంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయినులతో పాటు వివిధ రంగాలలో విధులు నిర్వహించే గ్రామస్థాయి ఉద్యోగినులను సత్కరించారు. పంచాయతీ కార్యదర్శి తిరుపతి, మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల బాసట



ఐరన్ బెంచీల కోసం విరాళం ఇస్తున్న పూర్వ విద్యార్థులు

బాన్సువాడ రూరల్: బోర్లం జెడ్పీహెచ్‌ఎస్‌లో మౌలిక సౌకర్యాల కల్పనకు పూర్వ విద్యార్థులు బాసటగా నిలిచారు. పాఠశాలలో ప్రస్తుతం 180 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. వారి కోసం 60 ఐరన్ బెంచీలు కావాలని ఇటీవల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ ప్రతిపాదన చేశామని తెలిపారు. ఆదర్శంగా ఉండాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయులు 15 బెంచీల కోసం విరాళం ఇచ్చి పూర్వ విద్యార్థులు కూడా సాయం అందించాలని వాట్సాప్ గ్రూప్‌లో విజ్ఞప్తి చేశారు. దీంతో పాఠశాల పూర్వ విద్యార్థి పుట్టి ప్రణయ్ రూ.25వేలు, సురంపల్లి నవీన్‌రెడ్డి రూ.20వేలు, 2006–07 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు రూ.8,500, 2007–08 బ్యాచ్ విద్యార్థులు రూ.11వేలు ప్రకటించారు. వీరితో పాటు దామరంచ విఠల్, లింగాల అమరేందర్‌రెడ్డి, బసిరెడ్డి విఠల్‌రెడ్డిలు రూ.8,500 చొప్పున అందజేశారు. అలాగే గొబ్బురు మనోజ్‌రెడ్డి, చిటిమెల్ల నవీన్, కాట్రోత్ ఓంకార్, పీఈటీ అనంద్, గాండ్ల కిరణ్‌లు రూ.5,100 చొప్పున అందజేశారు. అలాగే సుమారు 10 మంది ఒకటి, రెండు చొప్పున బెంచీలకు విరాళాలు ప్రకటించారు. ఇటీవల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ తన మిత్రబృందంతో సంప్రదించి విద్యార్థులకు రూ.4 లక్షల విలువైన 10 కంప్యూటర్లు బహూకరించి ల్యాబ్‌ను అందుబాటులోకి తెచ్చారు.

ముత్యంపేట పాఠశాలకు బెంచీల అందజేత

దోమకొండ: ముత్యంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కామారెడ్డికి చెందిన జిజిబాయి దామోదర్ రావ్ రూ.80 వేల విలువ చేసే బెంచీలను అందజేశారు. హైదరాబాద్ నుంచి బెంచీలను తయారు చేయించి పాఠశాలకు అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ తెలిపారు.

స్వయం పాలన దినోత్సవం



లింగంపేట(ఎల్లారెడ్డి): అయిలాపూర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదో తరగతి విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి కింది తరగతులకు విద్యా బోధన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు మాట్లాడారు. ఉపాధ్యాయులుగా ప్రతీ రోజు పాఠాలు చెప్తూ విద్యార్థులను క్రమ శిక్షణలో పెట్టడం ఎంత కష్టమో తెలిసిందన్నారు. అనంతరం బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు దామోదర్, ఉపాధ్యాయులు పద్మ, శివానంద్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సీపీ, డీపీవో





కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీపీ సాయిచైతన్య, డీపీవో శ్రీనివాస్‌రావు

నూతన సీపీగా బాధ్యతలు చేపట్టిన పి.సాయి చైతన్య, డీపీవోగా వచ్చిన శ్రీనివాస్‌రావు సోమవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

– నిజామాబాద్ అర్బన్/సుభాష్‌నగర్

మనిషి ఆలోచనలో మార్పురావాలి



మాట్లాడుతున్న గడ్డం వాణి

తెయూ (డిచ్‌పల్లి): మనిషి జీవితంలో విజయం సాధించాలంటే తన ఆలోచన విధానంలో మార్పురావాలని యూనివర్సిటీ ఆఫ్ టెక్సిక్స్ ప్రొఫెసర్, అకడమిక్ ఎడ్యుకేషన్ అడ్వయిజర్ డాక్టర్ గడ్డం వాణి అన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో సోమవారం విద్యార్థుల ఆలోచనలు– అవకాశాలు అనే అంశంపై కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ్ అధ్యక్షతన విస్తృతోపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గడ్డం వాణి మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో విజయం సాధించాలంటే నిరంతర అధ్యయనం, బహుముఖ విజయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అపజయాలు ఎదురైనప్పుడు అనుభవాలను గుణపాఠాలుగా మార్చుకొని, విజయం కోసం ముందడుగు వేయాలని ఉద్బోధించారు. కార్యక్రమంలో లా కాలేజ్ ప్రిన్సిపల్ ప్రసన్న రాణి, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ హెడ్ నాగరాజు, చీఫ్ వార్డెన్ మహేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాత్రికి రాత్రే ఇసుక తోడేస్తున్నారు

- పొతంగల్, రెంజల్ పరిధిలోని మంజీరా పరీవాహకంలో తవ్వకాలు
- అక్రమంగా టిప్పర్‌లలో తరలింపు
- పట్టించుకోని పోలీసులు, రెవెన్యూ, ఆర్టీఏ అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి



సోమవారం ఉదయం ఇసుకను తరలిస్తున్న టిప్పర్

ఖలీల్‌వాడి: మంజీర పరీవాహకంలో ఇసుక మాఫియాకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. రాత్రివేళ పొక్లెయినర్లు, ట్రాక్టర్ లోడర్స్‌తో ఇసుక తోడేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి రూ.లక్షల్లో గండిపడుతోంది. ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టేవారు మూడు గ్రూపులుగా మారి తమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. ఒక గ్రూపు అధికారులను మచ్చిక చేసుకుంటుండగా, మరో గ్రూపు మంజీరా పరీవాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వించి టిప్పర్‌లలో పంపిస్తారు. మూడో గ్రూపు ఇసుక టిప్పర్లకు ఎస్కార్ట్‌గా మారి ఎలాంటి ఇబ్బందులు లేకుండా గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. ప్రత్యేక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకొని అక్రమంగా ఇసుక తరలిస్తున్నా పోలీసులు, రెవెన్యూ, మైనింగ్, ఆర్టీఏ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

సామర్థ్యానికి మించి తరలింపు..

పొతంగల్ మండలం కల్లూర్, కొడిచర్ల, పొతంగల్, హంగార్గా, సుంకిని, రెంజల్ మండలంలోని నీలా, కందకుర్తి ప్రాంతాల నుంచి ఇసుక తరలిస్తున్నారు. మంజీరా పరీవాహక ప్రాంతంలో కొందరు ఇంటిపనుల కోసం ఇసుకను తరలిస్తుండగా, మరికొందరు ప్రభుత్వ కార్యక్రమాలకు ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. ఇక్కడి నుంచి తరలించిన ఇసుకను డంప్‌లుగా చేసుకుంటున్నారు. అనంతరం అక్కడి నుంచి టిప్పర్‌లలో సామర్థ్యానికి మించి తీసుకెళ్తున్నారు. రాత్రివేళలో ఇసుక అక్రమదందా కొనసాగుతుందని తెలిసినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇసుక టిప్పర్లతో ప్రమాదాలు జరిగినప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

వే బిల్లులు లేకుండానే..

ఇసుక తరలింపునకు సంబంధిత టిప్పర్లు, ట్రాక్టర్ల యజమానులు మీ సేవల్లో దరఖాస్తు చేసుకొని వాటికి చలాన్ కట్టాల్సి ఉంటుంది. అనంతరం జారీ అయిన వే బిల్లుతో ప్రభుత్వం కేటాయించిన రీచ్ నుంచి ఇసుకను తీసుకువెళ్లాలి. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక తవ్వకాలకు అనుమతి ఉంటుంది. కానీ ఇక్కడ అలాంటి నిబంధనలు ఉండవు. రాత్రివేళల ట్రాక్టర్ల ద్వారా ఇసుకను డంప్ చేస్తారు. అనంతరం అక్కడి నుంచి టిప్పర్‌లలో నిజామాబాద్, బోధన్ వంటి ప్రాంతాలకు ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇలా తరలించిన ఇసుకకు ఎలాంటి వే బిల్లులు ఉండవు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది.

ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలి

వే బిల్లు లేకుండానే రాత్రివేళ టిప్పర్లలో ఇసుక తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. రెవెన్యూ, పోలీసులు, మైనింగ్, ఆర్టీఏ అధికారులకు విన్నవించినా ఫలితం కనిపించడం లేదు. ఉన్నతాధికారులు దృష్టి సారిస్తేనే ఇసుక అక్రమ రవాణాను అరికట్టవచ్చు. ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి రాత్రివేళలల్లో తనిఖీ చేపట్టాలి.

– లింగారెడ్డి, నిజామాబాద్ లారీ ఓనర్స్, బిల్డింగ్ మెటీరియల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మాచారెడ్డి: పాల్వంచ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. భవానీపేట తండాకు చెందిన బూక్య సురేశ్, మాలోత్ తేజ పాల్వంచ నుంచి కామారెడ్డి వైపు బైకుపై వెళుతుండగా, వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

ఆటో దొంగ అరెస్ట్



ఖలీల్‌వాడి: జీజీహెచ్‌లో ఆటో చోరీ చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి సోమవారం తెలిపారు. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని సుల్తాన్‌పేట్ గ్రామానికి చెందిన అమృత్వార్ మోహన్ తన చిన్నమ్మ డెలివరీ కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. ఈ నెల 5న రాత్రి 10 గంటలకు తన ఆటోను జీజీహెచ్ పార్కింగ్ ఏరియాలో నిలిపాడు. మరుసటి రోజు ఉదయం చూసేసరికి ఆటో కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్‌హెచ్‌వో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం నగరంలోని బోధన్ బస్టాండ్‌లోని వాహనాల తనిఖీ చేస్తుండగా బర్కత్‌పురాకు చెందిన ఖలీద్ బిన్ మొహమ్మద్‌పై అనుమానంతో విచారించగా చోరీకి పాల్పడినట్లు తేలిందన్నారు. ఆటోను స్వాధీనం చేసుకొని, నిందితుడిని రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు ఆర్మీ జవాన్ మృతి



ప్రమోద్ భౌతికకాయానికి సెల్యూట్ చేస్తున్న అధికారి

సిరికొండ: మండల కేంద్రానికి చెందిన ఆర్మీ జవాన్ కాసుల ప్రమోద్ ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ నెల 1న హైదరాబాద్‌లోని తన గదిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ప్రమోద్‌కు తీవ్రగాయాలయ్యాయి. మొదట సికింద్రాబాద్ ఆర్మీ ఆస్పత్రిలో చేర్పించగా, మెరుగైన చికిత్స కోసం పుణెలోని మిలిటరీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 8న రాత్రి మృతి చెందాడు. ప్రమోద్ స్వగ్రామం సిరికొండలో సోమవారం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ప్రమోద్ భౌతికకాయానికి ఆర్మీ అధికారులతోపాటు సిరికొండ ఎస్సై ఎల్ రామ్ నివాళులర్పించారు. మృతుడికి తల్లిదండ్రులతోపాటు చెల్లెలు ఉన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య



వెంకటేశ్ గౌడ్ (ఫైల్)

బాల్కొండ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక మెండోరా మండలం వెల్కటూర్ గ్రామానికి చెందిన చంద్రగిరి వెంకటేశ్‌గౌడ్(39) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మెండోరా ఎస్సై నారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటేశ్‌గౌడ్ ఆరు నెలల క్రితం దుబాయి నుంచి ఇంటికి వచ్చి గీత కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బతుకుదెరువు కోసం గతంలో మూడుసార్లు దుబాయి వెళ్లగా అక్కడ సరైన పని లభించక తిరిగి వచ్చాడు. దుబాయి వెళ్లినప్పుడల్లా అప్పు చేసి ఏజెంట్లకు డబ్బులు చెల్లించాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. ఆదివారం వెంకటేశ్‌గౌడ్ భార్య శ్రావణి పిల్లలతో కలిసి తల్లిగారింటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

తాడ్‌బిలోలిలో మరొకరు..

రెంజల్(బోధన్): అనారోగ్యంతోపాటు ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన సాకినిగారి పోశెట్టి(55) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. గత నెల 22న ఇంటి నుంచి వెళ్లిన పోశెట్టి కనిపించకపోవడంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేశారు. సోమవారం స్థానిక చెరువులో మృతదేహం కనిపించడంతో జాలర్లతో బయటకు తీయించారు. అక్కడే శవ పంచనామా, పోస్టుమార్టం నిర్వహించి మృతుడి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ముషీర్‌నగర్‌లో యువకుడు..



మనోహర్ (ఫైల్)

సిరికొండ: అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ముషీర్‌నగర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎల్ రామ్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బట్టు మనోహర్(24) ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసై ఈ నెల 7న పురుగుల మందు సేవించాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న మనోహర్ ఈ నెల 9న రాత్రి మృతి చెందినట్లు ఎస్సై రామ్ సోమవారం తెలిపారు. మృతుడి భార్య గౌతమి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

రెండిళ్లలో చోరీ



దుండగులు పగులగొట్టిన ఇంటి గొళ్లెం

బాన్సువాడ : బాన్సువాడ పట్టణం సంగమేశ్వర కాలనీలో ఆదివారం రాత్రి రెండిళ్లలో చోరీ జరిగింది. కాలనీకి చెందిన దుబాస్ రాములు శుక్రవారం బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండడంతో ఇంటికి తాళం వేసి కోటగిరి వెళ్లాడు. ఇంటి తాళం పగులగొట్టిన దుండగులు 5 తులాల వెండి, దేవుడి చిత్రపటం వద్ద ఉన్న రూ.5 నాణేలను ఎత్తుకెళ్లారు. సోమవారం ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో రాములు పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించింది. ఇదే కాలనీలో ఉండే కాశమణి ఆదివారం బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లగా దుండగులు చోరీకి పాల్పడ్డారు. తులం 4 మాసాల బంగారం చోరీకి గురైనట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ముసుగు తొలగింది



సాక్షి ఎఫెక్ట్..

మాచారెడ్డి: కోడ్ ముగిసినా ముసుగు తొలగలేదన్న శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని గజ్యానాయక్‌తండా చౌరస్తాలో కామారెడ్డి–సిరిసిల్లా రహదారిపై ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ముసుగు వేశారు. ఎన్నికల కోడ్ ముగిసినా ముసుగు తీయలేదు. సాక్షిలో ప్రచురితమైన కథనంతో ముసుగు తొలగించారు.

ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కామారెడ్డి రూరల్: ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలని హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధి చేపూరి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం తిమ్మక్‌పల్లి ఉన్నత పాఠశాల, చిన్న మల్లారెడ్డి బాలికల ఉన్నత పాఠశాలల్లో సంస్థ తరఫున పదో తరగతి విద్యార్థులకు కెరియర్ గైడెన్స్– విజయ స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక ప్రశాంతతతో చదివితే అన్ని అంశాలు గుర్తుంటాయని, భయాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. అనంతరం సంస్థ మరో ప్రతినిధి కృష్ణారావు.. పదో తరగతి తరువాత ఉన్న విద్యా ఉద్యోగ అవకాశాలను వివరించారు. చిన్న మల్లారెడ్డి గ్రామానికి చెందిన జూనియర్ లెక్చరర్ రమేష్, చిరంజీవిల సహకారంతో విద్యార్థులకు పరీక్ష కిట్లను బహుమతిగా అందజేశారు. సంస్థ ప్రతినిధులు, పీఆర్‌టీయు ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, చంద్రశేఖర్, కృష్ణాకర్, హెచ్‌ఎం నళినీ దేవి, మమత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గెజిటెడ్' డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ



కామారెడ్డి క్రైం: జిల్లా గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం డైరీ, క్యాలెండర్‌లను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సోమవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్లు వి.విక్టర్, డి.శ్రీనివాస్ రెడ్డి, సీసీవో రాజారాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, భూగర్భజల శాఖ ఏడీ సతీష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.